సమస్యలకు వెంటనే పరిష్కారం : మంత్రి



రాయచోటిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బారు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా నీరు ఇప్పించేందుకు చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ మంత్రి ఆదేశాలు చేశారు.

డిసెంబరు ఆఖరులోగా రోడ్ల నిర్మాణం పూర్తి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణాలను డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేసే విధంగా పనిచేస్తున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలోని పలు కూడళ్లు, రోడ్లను ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలసి కలెక్టర్ పరిశీలించారు. పలు చోట్ల ట్రాఫిక్ సమస్యలు ఉండటం గమనించి రోడ్ల విస్తరణ ఆవశ్యకతపై మాట్లాడారు. పట్టణంలో రోజురోజుకు జనాభా పెరిగిపోతోందని, దీని వలన వాహనాల సంఖ్య కూడా పెద్దసంఖ్యలో పెరిగిపోతోందన్నారు. ఇలాంటి సమయాల్లో పట్టణంలో ఇరుకైన రోడ్ల విస్తరణ తప్పనిసరిగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీని వలన భవిష్యత్తులో పట్టణం అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. మదనపల్లె నియోజకవర్గానికి రూ.8 కోట్లతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చక్కగా పనులు చేయిస్తున్నారని కితాబిచ్చారు. మదనపల్లెలో ప్రభుత్వ, డీకేటీ భూముల వివాదాలు ఉన్నాయని, ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో ఆక్రమణలను స్వాధీనం చేసుకుని వాటికి కంచె వేయడంతో పాటు అవసరమైన చోట్ల ప్రహరీలు నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ పట్టణంలోని కోమటివానిచెరువు సుందరీకరణ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, పీఆర్ డీఈ శివప్రసాద్, తహసీల్దార్ ఖాజాబీ, ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర్, ఆర్‌అండ్‌బీ ఈఈ అరవిందదేవి, ఏఈ రమణ, వెండర్ రాటకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 19 కరువు మండలాలు

● కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాభావ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని 19 మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా జీవో నెంబర్-15 ద్వారా ఈనెల 29వ తేదీ జారీ చేసిన ఉత్తర్వులు జిల్లాకు అందాయని తెలిపారు. నైరుతి రుతుపవనాల కాలంలో ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు సగటు వర్షపాతం, సాధారణంలను పరిగణలోకి తీసుకొని ఆయా మండలాల నుంచి ప్రాథమిక నివేదికలను అధికారులు ప్రభుత్వానికి అందచేశారని తెలిపారు. గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లె, టి.సుండుపల్లె, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, వీరబల్లి, తంబళ్లపల్లి, గుర్రంకొండ, కలకడ, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, మదనపల్లె, నిమ్మనపల్లి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

రాయచోటి (కలెక్టరేట్) /టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగ అయిన దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడులు వేర్వేరు ప్రకటనల్లో జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చెడును త్యజించి, మంచిని పెంచాలని మతాబులు, చిచ్చుబుడ్లు, కాకర వత్తుల వెలుగులతో జిల్లాలో ప్రతి ఇంట శుభాలు కలగాలని ఆకాంక్షించారు. వారితో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ కూడా శుభాకాంక్షలు తెలిపారు.





సిరులు కురిపిస్తున్న దోస

● డివిజన్ పరిధిలో 150 ఎకరాల్లో సాగు ● కష్టాల నుంచి గట్టెక్కిన దోస రైతులు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గత ఐదు సంవత్సరాలుగా లక్కిరెడ్డిపల్లె డివిజన్ పరిధిలో కరువు ఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రాంతంలో జల వనరులు లేవు. కేవలం వర్షాధారంతోనే పంటలు సాగు చేసుకోవాలి. ఒక సంవత్సరం సక్రమంగా వర్షాలు కురవకపోతే బోర్లల్లో నీరు తగ్గిపోతాయి. పంటలు కూడా అంతంత మాత్రమే పండుతాయి. దీంతో ఈ ప్రాంత రైతులకు వ్యవసాయం అందని ద్రాక్షలాగా ఉంటుంది. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవడం లేదు అరకొరగా కురిసిన వర్షాలకు వేరుశనగ, కంది, ఉలవలు సాగుచేసినా సరైన దిగుబడి లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ కరువులో కూడా లక్కిరెడ్డిపల్లె డివిజన్ పరిధిలో 150 ఎకరాల్లో మహారాణి దోసపంట సాగు చేశారు. పంట ఆశాజనకంగా ఉంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందే అవకాశం ఉందని రైతులు శివారెడ్డి, ఖాదర్‌బాష, మల్లికార్జున, వెంకటరామిరెడ్డిలు తెలిపారు. 60 రోజుల పంట మంచి దిగుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కిలో మహారాణి దోస విత్తనాలు 38 వేల రూపాయలతో కొనుగోలు చేశారు. లక్కిరెడ్డిపల్లె, రామాపురం, వీరబల్లి మండలాల్లో వందల ఎకరాల్లో పంట సాగు చేశారు. ఎకరాకు లక్ష రూపాయలు ఖర్చులు వచ్చాయని మంచి దిగుబడులు వస్తే ఎకరాకు 4 లక్షల రూపాయల ఆదాయం వస్తుందని రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలోని అప్పకొండయ్యగారిపల్లెకు చెందిన శివారెడ్డి అనే రైతు ఎన్ని పంటలు సాగు చేసినా చివరకు అప్పులు తప్ప లాభాలు రాలేదని నిరాశతో ఉన్న సమయంలో మిత్రుడు వీరనాగిరెడ్డి ఇచ్చిన సలహాతో ఒకేచోట 7 ఎకరాల్లో మహారాణి దోసపంట సాగు చేశాడు. పంట ఆశాజనకంగా ఉంది. ఆశించిన లాభాలు వచ్చినట్లు శివారెడ్డి తెలిపారు. ఈమధ్య కాలంలో రామాపురం, వీరబల్లి మండలాల్లో వర్షం రాక మునుపే పంట కోసం ముంబాయికి తరలించారు. ముంబాయి మార్కెట్‌లో టన్ను దోసకాయలు 40 వేల రూపాయలు పలికాయని రైతు తెలిపాడు. ఎకరాకు 10 టన్నుల కాయల వచ్చాయని ఖర్చులు పోను ఎకరాకు 3 లక్షల రూపాయలు లాభాలు వచ్చాయని దోస సాగు చేసిన ఇతర రైతులు హిమామహ, జనార్ధన, సలాఉద్దీన్ తెలిపారు. వర్షానికి ముందుగా పంటకోసి ముంబాయికి తరలించిన వారికి మాత్రం మంచి లాభాలు పొందారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొంతమాత్రం కాయలు దెబ్బతిన్నాయని, ఎకరాకు 10 టన్నుల కాయలు దెబ్బతిని ఎకరాకు 8 టన్నులు మాత్రమే అయ్యాయని శివారెడ్డి తెలిపారు. ఏదిఏమైనా ఎకరాకు 4 లక్షల రూపాయలు వస్తాయని ఆశించామని వర్షం వల్ల 2.50 లక్షల రూపాయాలు వచ్చాయని మొత్తం మీద 7 ఎకరాలకు 15 లక్షల ఆదాయం వచ్చిందని రైతు తెలిపాడు.

తోటలో దోసకాయలు కోస్తున్న కూలీలు





మహారాణి దోసకాయలు



లారీలోకి లోడ్ చేస్తున్న దోసకాయలు



విరగ్గాసిన దోసకాయలు

కరువులో మంచి లాభాలనిచ్చింది



బోరులో నీరున్నా ఎన్ని పంటలు సాగు చేసినా సరైన దిగుబడులు రాక చివరకు వ్యవసాయం అప్పులపాలు అయ్యేది. చివరి ఆశగా రామాపురం మండలంలోని సలావుద్దీన్ సాగు చేసిన దోస పంటను చూసి నేను కూడా మహారాణి దోసపంటను సాగు చేశాను. విత్తనాలు కిలో 38 వేల రూపాయలతో కొన్నాను. 60 రోజుల పంట తక్కువ ఖర్చుతో మంచి లాభాలు వచ్చాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఆదాయం కొంచెం తగ్గింది. అయినా లాభాలతో కష్టాల నుంచి గట్టెక్కాను.

- శివారెడ్డి, రైతు, చింతకుంటవాండ్లపల్లె

నాటుసారా జోలికెళితే జైలుశిక్షే

● నాటుసారా బట్టీలు ధ్వంసం ● 2300 లీటర్ల సారా ఊట నాశనం : సీఐ



మేకలవారిపల్లెలో నాటుసారా తయారీ సామాగ్రిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

వాల్మీకిపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారు చేసినా, విక్రయాలకు పాల్పడినా జైలుశిక్ష తప్పదని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు హెచ్చరించారు. బుధవారం మండలంలోని గండబోయనపల్లె గ్రామ పంచాయతీ మేకలవారిపల్లె పరిసర ప్రాంతాల్లో పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని రహస్య ప్రాంతాలలో నిర్వహిస్తున్న నాలుగు నాటుసారా బట్టీలను ధ్వంసం చేశారు. అలాగే రహస్యంగా దాచిన 2300 లీటర్లు నాటుసారా ఊటను ధ్వంసం చేసి తయారీ పరికరాలను సీజ్ చేశారు. అనంతరం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. నాటుసారాతో పట్టుబడితే ఉపేక్షించేది లేదని ఎంతటివారైనా సరే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా నాటుసారా తయారీ, విక్రయాలపై సమాచారం అందించాలని తెలియజేశారు. నిత్యం నిఘా పెట్టి నాటుసారాను రూపుమాపే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో వాల్మీకిపురం, గుర్రంకొండ ఎస్‌ఐలు చంద్రశేఖర్, మధురామచంద్రుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నారామాకుల తాండాలో సారా ధ్వంసం



నారామాకుల తాండాలో గ్రామస్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న తాలుకా సీఐ కళా వెంకటరమణ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని నారామాకుల తాండాలో తాలుకా సీఐ కళా వెంకటరమణ, ఎస్‌ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో 50 మంది పోలీసులతో బుధవారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో సుమారు వెయ్యి లీటర్లకు సారా బట్టీలను ధ్వసం చేశారు. ఈ సందర్భంగా సీఐ కళా వెంకటరమణ గ్రామస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామంలో నాటుసారా తయారీ ఆపేయాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమతికి మించి నిర్మాణాలపై చార్జిషీట్

మదనపల్లెటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అనుమతి గోరంత...నిర్మాణం కొండంత శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మదనపల్లె మున్సిపల్ అధికారులు స్పందించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ పట్టణానికి చెందిన ఎం.చంద్రశేఖర్, ఎం.రాజనారాయణ పేరిట ప్లానులు మంజూరు చేయగా వారు అనుమతికి మించి నిర్మాణాలు చేపట్టారన్నారు. దీనిపై గత ఏడాది నవంబరులో, ఈ ఏడాది జనవరిలో నిర్మాణాలు నిలిపివేయమని నోటీసులు ఇచ్చామన్నారు.. అయినా వారు నిర్మాణాలు చేస్తుండగా ఆగస్టు 17వ తేదీ మళ్లీ నోటీసు ఇచ్చామన్నారు.

ఏపీ పురపాలక చట్టం1965 సెక్షన్‌లోని 140 ప్రకారం పై తెలిపిన ఇద్దరు వ్యక్తులను ప్రాసిక్యూషన్ చేసేందుకు కోర్టులో కేసు వేశామని, దీనికి సంబంధించి చార్జిషీట్ కూడా నెంబర్ అయ్యిందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

వంద శాతం పింఛన్ల పంపిణీ జరగాలి

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవంబరు 1వ తేదీ వంద శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరగాలని, ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా డీఆర్‌డీఏ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, డీపీవో, ఎంపీడీవోలు, డీఎల్‌డీవోలు, ఎల్డీఎం తదితర అధికారులతో పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందుబాటులో లేని వారు, ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నవారు తప్ప మిగతా 99 శాతం పింఛన్ల పంపిణీ 1వ తేదీనే జరగాలన్నారు. లబ్ధిదారులకు ముందస్తు సమాచారాన్ని టామ్‌టామ్, ఇతర మాధ్యమాల ద్వారా అందించి వారు ఇంటి వద్దే ఉండేలా చూడాలన్నారు. పింఛన్ల పంపిణీ జరిగేటప్పుడు ప్రజలందరూ గుమికూడకుండా చూడాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మంత్రులు లేదా ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొనేటప్పుడు ఏ ఇంటిలో అయితే పింఛను పంపిణీ జరుగుతుందో ఆ ఇంటి వారు మాత్రమే పింఛను పొందేలా చూడాలని, టెంటు వేసి ప్రజలందరినీ గుమికూడేలా చేయకూడదన్నారు. పింఛన్ల పంపిణీపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్‌ను, మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు.

ఉచిత సిలిండర్ల పంపిణీకి ఏర్పాట్లు : జేసీ



రికార్డు రూమును పరిశీలిస్తున్న జేసీ

పీలేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమ ప్రారంభోత్సవానికి తగిన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పీలేరు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పీలేరు తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్యాస్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వస్తున్న వివిధ సమస్యలు, చుక్కల భూములు, ఫ్రీహోల్డ్ భూముల రీ-వెరిఫికేషన్ తదితర అంశాలపై ఆయన స్థానిక సిబ్బందిని పలు ప్రశ్నలు అడిగి తగు సూచనలు చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ప్రయత్నాలపై సమీక్షించారు. ఆ తరువాత కార్యాలయంలోని రికార్డు గదిని పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక దుర్గా గ్యాస్ ఏజెన్సీని సందర్శించి దీపం పథకం లబ్ధిదారుల గురించి వాకబు చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు భీమేశ్వరరావు, సీఎస్ డీటీ ఫజులుల్లా, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలి

● ఈవీఎం గోడౌన్ తనిఖీలో కలెక్టర్



ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

రాయచోటి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించిన ఈవీఎంలపే భద్రపర్చిన గోదాము వద్ద 24-7 ప్రకారం నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రాయచోటి పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఉన్న ఈవీఎం గోదామును బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాలు, బీయూలు, సీయూలు, వీవీ ప్యాట్‌లను అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వివిధ అంశాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ పుల్లారెడ్డి, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహకుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

రాజంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి ప్రవేశానికి గడువును నవంబరు 9వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఎం.గీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో 9వ తరగతి ప్రవేశానికి ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉమ్మడి కడప జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2025 ఫిబ్రవరి 8వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గూడరేవుపల్లె విద్యార్థినులు



విద్యార్థినితో ఉపాధ్యాయులు

పీలేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో వచ్చే నెల 3, 4 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు పీలేరు మండలంలోని గూడరేవుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగరత్నమ్మ తెలిపారు. ఇటీవల చిత్తూరులో జరిగిన ఎంపిక పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఎం.పూజిత (సీనియర్స్ విభాగం), పి.పల్లవి (జూనియర్స్ విభాగం) ఎంపికయ్యారని ఆమె వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో వారిద్దరూ చిత్తూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ రాణిని బుధవారం పాఠశాలలోని ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యవసాయశాఖ ఏడీఏగా శంకర్‌నాయక్

కలికిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వై.శంకర్‌నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో డిప్యుటేషన్‌పై మున్సిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్‌కు వెళ్లిన శంకర్‌నాయక్‌ను ఆగస్టు 8న మాతృ సంస్థ అయిన వ్యవసాయ శాఖకు తిప్పి పంపారు. ఆ మరుసటి రోజు పోస్టింగ్ కోసం ఆయన వ్యవసాయ శాఖ కమిషనరు వద్ద రిపోర్టు చేసుకున్నారు. తాజాగా శంకర్‌నాయక్‌ను కడప ఏడీఏగా నియమించారు. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

750 గ్రాముల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

ఓబులవారిపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని ఎల్లాయపల్లె హరిజనవాడకు చెందిన మద్దెల నరసయ్యను ఆ ప్రాంతంలోని సర్కిల్ వద్ద అదుపులోకి తీసుకుని అతడి నుంచి గంజాయి ప్యాకెట్లు, మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. పంచనామా నిర్వహించి గంజాయి సుమారు 750 గ్రాములుగా నిర్ధారణ చేసి, నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మార్కెట్‌లో దీని విలువ సుమారు 15 వేలు ఉంటుందని అంచనా వేశారు. కార్యక్రమంలో పోలీసుస్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసిన జీఎన్ నాయుడు



గవర్నర్ కైలాష్‌నాథ్‌ను సన్మానిస్తున్న జీఎన్ నాయుడు

రాజంపేట, అక్టోబరు 30 : లెఫ్టినెంట్ గవర్నర్ ఎల్‌జీ కైలాష్ నాథ్‌ను రీజెన్సీ సంస్థల అధ్యక్షుడు జీఎన్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. రీజెన్సీకి సహజవాయువు సరఫరాతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు స్పందించిన అన్ని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కైలాస్‌నాథ్ ఎంతో సానుకూలంగా స్పందించారని జీఎన్ నాయుడు తెలిపారు. సమావేశంలో రీజెన్సీ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ నరాల సత్యేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై.. నోటీసులతో సరి..!

● సెర్ప్ సీఈవో ఆదేశాలతో అయినా ముందడుగు పడేనా?

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వల్లూరు మండలంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సంబంధించిన దాదాపు రూ.80లక్షలు దారిమళ్లాయి. ఈ వ్యవహారంపై ఏడాది క్రితం మహిళా సంఘాల ప్రతినిధులు వల్లూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో అక్రమార్కులకు పెద్దల అండ ఉండడంతో కేసులు నమోదు చేయలేని పరిస్థితి ఉండేది. ప్రభుత్వం మారింది.. ఇకనైనా చర్యలు ఉంటాయని అందరూ భావించారు. మహిళా సంఘాల ప్రతినిధులు కమలాపురం ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన కూడా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించినట్లు సమాచారం. అయినా ఇప్పటికీ కేసు నమోదు కాలేదు. వివరాలిలా..

వల్లూరు మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ.95 లక్షలు నిధులు దారి మళ్లినట్లు అధికారులు గుర్తించారు. తప్పెట్ల ఎంఏఎస్ నుంచి రూ.59.60లక్షలు, తప్పెట్ల వీఓ-1 నుంచి రూ.10.93 లక్షలు, తప్పెట్ల వీఓ-2 నుంచి రూ.9.54 లక్షలు, దుగ్గాయపల్లె వీఓ-2 నుంచి రూ.3.80లక్షలు, తోళ్లగంగనపల్లె నుంచి రూ.1.49లక్షలు, లేబాక నుంచి రూ.65.72 లక్షలు దారి మళ్లినట్లు సమాచారం. దీంతో శాఖాపరమైన విచారణతో పాటు కలెక్టరు ఆదేశాలతో థర్డ్ పార్టీ విచారణ కూడా చేపట్టింది. అక్రమాలు జరిగినట్లు గుర్తించిన థర్డ్ పార్టీ విచారణ అధికారి.. నిధులు దారి మళ్లడం వెనుక సెర్ప్‌లోని అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని, మరింత లోతుగా విచారణ చేయాల్సి ఉందని తన నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదిక ఆధారంగా కమ్యూనిటీ కోఆర్డినేటరు సునీతపై సస్పెన్షన్ వేటు వేశారు. థర్డ్ పార్టీ విచారణ అధికారి ఎదుట తాను డ్రా చేసిన నిధుల నుంచి రూ.20లక్షలు మేర గతంలోని ఏరియా కోఆర్డినేటరుకు ఇచ్చినట్లు ఆమె వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. ఇందులో ఎవరికి ఎంత మేర ప్రమేయం ఉందనేది నిగ్గు తేల్చాలంటూ మహిళా సంఘాల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు మాత్రం ఇప్పటికీ కేసు నమోదు చేయలేదు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ సెర్ప్ సిబ్బందికి ఇక డీఆర్డీయే అధికారులు నోటీసులు ఇవ్వడంతో సరిపెట్టారు. నెలలు గడుస్తున్నా ఈ నోటీసులకు సమాధానం కూడా ఇవ్వలేదని సమాచారం.



ఇదిలా ఉంటే నోటీసులు అందుకున్నవారిలో అన్నమయ్య జిల్లాలో డీఆర్డీయే పీడీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న బి.సత్యనారాయణ కూడా ఉన్నారు. ఈయన 2014 ఆగస్టు 20 నుంచి 2019 జూలై 12 వరకు కమలాపురం ఏరియా కోఆర్డినేటరుగా పనిచేశారు. ఆ సమయంలో విధుల పట్ల నిర్లక్ష్యం కారణంగానే నిధుల దుర్వినియోగం జరిగాయని అధికారులు భావించారు. ప్రస్తుతం సత్యనారాయణ అన్నమయ్యజిల్లాలో ఏరియా కోఆర్డినేటరుగా విధులు నిర్వహిస్తూ ఇన్‌చార్జి పీడీగా ఉన్నారు. ఆయన తరువాత కమలాపురం ఏరియా కోఆర్డినేటరుగా విధులు నిర్వహించిన రఘునాథరెడ్డికి కూడా నోటీసులు జారీ చేసి సంజాయిషీ కోరారు. నోటీసులకు నెలలు గడుస్తున్నా సంజాయిషీ ఇచ్చిన పరిస్థితి లేదు. అయినా ఉన్నతాధికారులు మౌనం దాల్చడం వెనుక ఆంతర్యం ఏమిటో ఎవరికీ అంతు చిక్కడంలేదు.

సెర్ప్ ఆదేశాలతో అయినా..

ఇటీవల సెర్ప్ సీఈవో జూమ్ మీటింగ్‌లో ఎక్కడా అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఆర్డీయే ప్రాజెక్టు డైరెక్టర్లను ఆదేశించారు. ఎక్కడైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అందుకు సంబంధిత పీడీలే కారణమవుతారని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. ఇప్పటికైనా నిధుల దుర్వినియోగంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవడంతో పాటు మహిళా సంఘాల సొమ్ము రికవరీ చేయాలని బాధితులు కోరుతున్నారు.

నోటీసులు ఇచ్చాం

- ఆనంద్‌నాయక్, పీడీ, డీఆర్డీఏ

వల్లూరు మండలంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. వారి నుంచి సమాధానం రావాల్సి ఉంది. సొమ్ము స్వాహా చేసిన కమ్యూనిటీ కోఆర్డినేటరు నుంచి కొంత మొత్తం రికవరీ చేశాం. త్వరలో ఈ విషయంపై చర్యలు తీసుకుంటాం.

సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ



సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, అక్టోబరు 30:(ఆంధ్రజ్యోతి) మండలంలోని జంగిటివారిపల్లెలో రూ. 20 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులకు బుధవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి భూమి పూ జ చేశారు. పీఆర్ డీఈ బాలనరసింహులు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, గుగ్గిళ్ల సుబ్బరాయుడు, నల్లంశెట్టి యానాదయ్య. కొవ్వూరు నారాయణ, ఉత్తరాది శివకుమార్, ముద్దపోలు రామసుబ్బయ్య, ముద్దపోలు సభాపతి, కొండేటి చలపతి, టీడీపీ నాయకులు కట్టా గుండయ్య నాయుడు, తిమ్మిశెట్టిపల్లె మణి, నాగినేని వెంకటరమణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా డీఈవో సుబ్రమణ్యం ఓపెన్ స్కూల్స్ అన్నమయ్య జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరాజుతో కలిసి బుధవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల బలో పేతానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. పాఠశాలల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందిం చారు. ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ఆలయాలకే ధూపందీపం

గాలివీడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆదా య వనరులు లేని ప్రభుత్వం నిర్దేశించిన అర్హత కలిగిన ఆలయాలకు మాత్రమే ధూపదీప నైవేద్య పథకం వర్తిస్తుందని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య తెలిపారు. బుధవారం పూలుకుంట పంచాయతీలోని శ్రీరామస్వామి, చెన్నారాయుడు స్వామి, బోరెడ్డిగారిపల్లె పంచాయతీలోని శ్రీరామాలయం, బోయ కొండ గంగమ్మ దేవాలయం, లక్కిరెడ్డిపల్లె మండలం కుర్నూతల శివాలయా లను సందర్శించారు. ఈ సందర్భంగా పూలుకుంటలో ఆయన మాట్లాడుతూ ధూపదీప నైవేద్య పథకానికి దరఖాస్తు చేసిన దేవాలయాలను పరిశీలించామన్నారు. సర్పంచులు పార్థసారథిరెడ్డి, లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, ప్రభాకర్‌నాయుడు, అర్చకులు సుబ్రమ ణ్యంశర్మ, మురార్జీ, హరినాథరెడ్డి, సాంబశివ, రమణమ్మ పాల్గొన్నారు.

శిథిల గృహాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- 15 కార్యాలయాలు అద్దె భవనాల్లోనే
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- బిక్కుబిక్కుమంటున్న ఉద్యోగులు



కూలిపోయిన వ్యవసాయ కార్యాలయ భవనం

శిథిలావస్థకు చేరుకున్న పశువైద్య కార్యాలయం



లక్కిరెడ్డిపల్లె అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 30: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికభాగం శిథిల భవనాల్లోనే నిర్వహిస్తుండగా, పలు కార్యాలయాలకు అవి కూడా లేకపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలో 1947 సంవత్సరానికి ముందు బ్రిటిష్ పాలకు గట్టి రాయి, ఇసుక, సున్నంతో పలు కార్యాలయాల భవనాలు నిర్మించారు. అప్పట్లో నిర్మించిన ఓ భవనమే ఇప్పటికీ తహసీల్దారు కార్యాలయంగా వినియోగిస్తున్నారు. భవనాలు నిర్మిం చారు. ఆయా భవనాల్లో చాలావరకు శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి, కాగా, 1932లో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం మాత్రం కాలానికి ఎదురీదుతూ సేవలందిస్తోంది. అందులో కూడా వర్షం వస్తే ఫైళ్లు అన్ని తడిసి ముద్దవుతుంటా యి. ఈ కార్యాలయంలో 1932 నుంచి 1947 వరకు ఉన్న డాక్యుమెంట్లు, మ్యాప్‌లు, లేఔట్లు, అడంగల్, దస్తావేజులు, ఎన్నో పాత రికార్డులు చాలీచాలని గదుల్లో భద్రపరచారు. కొన్ని కార్యాలయాల్లో అసలు రికార్డులు లేవు. వ్యవసాయ కార్యాలయంలో 25 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే ఈ కార్యాలయం కూడా తడిసి ముదవుతుంది., పైకప్పు పెచ్చులూడుతుండడంతో సిబ్బంది దినదిన గండంగా పనిచేస్తున్నారు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఇద్దరు పశువైద్య అధికారులు, 8 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ భవనంలో సైతం వర్షం వస్తే నిలుచుని విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కోనంపేటలో ఇంత వరకు పక్కా భవనం లేకపోవడంతో మొండిగోడల మధ్య పనిచేస్తున్నారు.. శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు కార్యా లయ భవనం నిర్మించి 35 ఏళ్లు పూర్తయింది. ఈ భవనం కూలి పోవడంతో ప్రస్తుతం అద్దెభవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఈ భవనంలో సమావేశాలు నిర్వహించేందుకు వీలు లేకపోవడంతో చెట్ల కింద సమావేశం నిర్వహించాల్సివస్తోంది, పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలో గతంలో 100 మంది సిబ్బంది పనిచేసేవారు, ఈ కార్యాలయ భవనం కూలిపోవడంతో ఆఫీసు రాయచోటికి మార్చారు. ఆర్ అండ్ బీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది, ట్రెజరీ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో ఓ చిన్న గదిలో విదులు నిర్వహిస్తున్నారు, మండలంలో 5 విద్యుత్ సబ్‌స్టేషన్లుండగా, అధికారుల కార్యాలయాలన్నీ అద్దె భవనాలో కొనసాగుతున్నాయి. ఐసీడీఎస్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, నాలుగు బ్యాంక్‌లు, మార్కెట్‌యార్డ్, అంగన్ వాడీ భవనాలు, అన్ని కార్యా లయాలు అద్దె భవనాల్లో పరిపాలన కొనసాగుతోంది, ఈ మధ్య కాలంలో మండలానికి 11 ఆర్‌బీకేలు, 11 హెల్త్‌సెంటర్లు, 11 గ్రామవార్డు సచివాలయాలకు భవనాలను మంజూరు కాగా, వాటిలో చాలా వరకు నిర్మాణం పూర్తి కాలేదు. .లక్కిరెడ్డిపల్లె తాలూకాలో ప్రభుత్వ కార్యాలయాల్లో అధిక భాగం అద్దెభవనాల్లోనే నిర్వహి స్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ నూతన భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

జాబ్‌మేళాలో 21 మంది ఎంపిక

రైల్వేకోడూరు, అక్టోబరు 30:(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ కార్యాలయం లో బుధవారం ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి, డీఆర్‌డీఏ, సిడాప్ సంస్థల ఆధ్వర్యం లో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శ్రీసిటీకి చెందిన డైకిన్ సంస్థ ప్రతినిధి పవన్ మాట్లాడుతూ నిరుద్యోగులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెలా జాబ్ మేళాలను నిర్వహిస్తామని తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు గ్లోబల్ ట్రస్ట్ కార్యాలయంలో నమోదు చేసుకుంటే ఉద్యోగ అవకాశాలు తెలుపుతుంటామని తెలిపారు. బీటెక్ పూర్తి చేసిన వారికి శాశ్వత ఉద్యోగాలు కూడా ఉన్నాయని తెలిపారు. శ్రీసిటీ ఉద్యోగాల హబ్ అని, అక్కడ 150 మందికి పైగా కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైల్వేకోడూరులోనే తమ సంస్థలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జాబ్ మేళాకు 47 మంది నిరుద్యోగులు హాజరు కాగా 21 మందిని ఎంపిక చేసినట్లు గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఛైర్మన్ కే. పార్థసారధి వివరించారు. ఈ కార్యక్రమం లో స్కిల్ డెవలప్మెంట్ కో-ఆర్డినేటర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట రెడ్డి

రైల్వేకోడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిం దూ పరిషత్ ఆధ్వర్యంలో ఆధ్మాత్మిక కార్యక్రమాలు ని ర్వహించనున్నట్లు ఆ సంస్థ రైల్వేకోడూరు అధ్య క్షుడు దరిశా వెంకటరెడ్డి తెలిపా రు. బుధవారం పట్టణంలోని ఆర్యవైశ్య సమాజంలో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాటాడారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ జిల్లా కార్యదర్శి సాయం శ్రీధర్, సహాయ కార్యదర్శి ఎస్. మల్లికార్జున, ప్రతినిధులు రెడ్డయ్యరాజు, పెంచల్‌రెడ్డి, బీజేపీ జిల్లా సహాయ కార్యదర్శి పులపుత్తూరు రామసుబ్బారెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు అలుగంటి ధశరథరామయ్య, కనిగెపుల శ్రీనివాసులు, కస్తూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్‌పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

రైల్వేకోడూరు, అక్టోబరు 30: (ఆంధ్రజ్యోతి) మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవా లని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి. రమేష్ విద్యార్థులకు సూచించారు. బు. దవారం రైల్వేకోడూరు ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అధ్యాపకులు డి. వెంకటేశ్వర్లు, కళాశాల ఐక్యూ ఏసీ కో-ఆర్డి నేటర్ జి. దయానందం, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ కే. రమేష్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్. సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

చలో విశాఖ పోస్టర్ల విడుదల

రైల్వేకోడూరు, అక్టోబరు 30:(ఆంధ్రజ్యోతి) విశాఖ స్టీల్ పరిరక్షణకు, కడప జిల్లా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం నిర్వహిస్తున్న చలో విశాఖకు సంబంధిం చిన గోడపత్రాలను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ బుధ వారం విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ను అంగడి సరుకులా చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తే ఉద్యమాలు ఉగ్ర రూపం దాలుస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయ కులు జగన్, పవన్‌కుమార్, మహేష్, నిరాజ్, హరినాథ్, అభినయ్‌కుమార్, భరత్, వంశీ, నవదీప్, దామోదర్, నిఖిలి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి మోటారుకు మరమ్మతులు

సుండుపల్లె, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ నల్లగుట్టపల్లి సమీపంలో యానాదికాలనీలో బుధవారం తాగునీటి పంపు, మోటారుకు మరమ్మతులు చేయించినట్లు టీడీపీ సీనియర్ నాయకులు ఎల్వీ రమణ, ఎస్సీ సెల్ నాయకుడు చంద్రమౌళి తెలిపారు. రెండు నెలల క్రితం మోటారు కాలిపోగా వారం రోజుల క్రితం తాగునీటి వసతి కల్పించాలని గిరిజన సంఘ నాయకుడు అమ్మనాయక్ సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. దీంతో టీడీపీ నాయకులు మోటారును రిపేరు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించారు. .

14,006 కుటుంబాలకు ఉచిత సిలిండర్

రామాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని 14,006 మంది ఇండేన్ గ్యాస్ కనెక్షన్లు ఉచిత సిలిండర్‌కు అర్హత సాధించాయని మండలం లోని ఇండేన్ గ్యాస్ యజమాని సుబ్బారెడ్డి తెలిపారు. వినియోగదారు లందరూ ఈకేవైసీ చేయించుకుంటే మరికొంత మంది వినియోగదారులు అర్హులు అవుతారన్నారు. ప్రతి ఒక్కరికీ రేపటి నుంచి మార్చి 31 వరకు ఒక సిలిండర్ వస్తుందన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

వీరబల్లి, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మట్లి పెద్దూరుకు చెందిన భూష య్యా నాయుడుకు రాజంపేట నియోజ కవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం బుధవారం సీ ఎం సహాయనిధి చెక్కును అందజే శారు. ఇటీవల అనారోగ్యం కారణం గా చికిత్స పొందిన ఆయన సీఎం సహాయ నిధికి దర ఖాస్తు చేసుకోవడంతో రూ.27,100 మంజూరైంది. ఇందుకు సం బంధిం చిన చెక్కును బుధవారం అందజేశారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేపర్ ప్రెజెంటేషన్‌లో విద్యార్థుల ప్రతిభ

రాజంపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిజ్ఞాన 2కే 24లోలో అన్నమాచార్య విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు బుధవారం తెలిపారు. ఈనెల 24, 25 తేదీలో కర్నూలు జిల్లాలోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ జాతీయ స్థాయి సదస్సులో అన్నమాచార్య యూనివర్సిటీలో బీటెక్ సీఎస్‌ఈ చివరి సంవత్సరం విద్యార్థులు వై.రాఘవేంద్ర, ఎస్.స్నేహలతారెడ్డి ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు యూనివర్సిటీ వ్యవస్థాపకుడు చొప్పా గంగిరెడ్డి జ్ఞాపికలు బహూకరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.మల్లికార్జున రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, సీఎస్‌ఈ విభాగా. దిపతి డాక్టర్ ఎం.సుబ్బారావు అభినందించారు.

బాణసంచా దుకాణాల పరిశీలన



రైల్వేకోడూరులో వ్యాపారులకు సూచనలు ఇస్తున్న అధికారులు

రైల్వేకోడూరు, అక్టోబరు 30:(ఆంధ్ర జ్యోతి) మండలంలోని రెడ్డివారి పల్లె పరిధిలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకా ణాలను బుధవారం రై ల్వేకోడూరు తహసీల్దార్ మ హబూబ్ చాంద్, సీఐ కే. హేమసుందరరావు, ఆర్ఐ లక్ష్మీదేవి తదితరులు పరిశీలించారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక లో సిండికేటుతో.. బాణసంచా ధరలు పైపైకి అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి వారు స్పందిం చారు. బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసిన ప్రాంతంలో వసతులు, వెహికల్ పార్కింగ్, అగ్నిప్రమాదాలకు గురికాకుండా వ్యాపారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు తదితర అంశాలను పరిశీలించారు. దుకాణాల వద్ద ఏ చిన్న ప్రమాదం జరిగినా వ్యా పారులే బాధ్యత తీసుకోవాల్సి వస్తుందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గాలివీడు: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టపాసుల కేంద్రా లను తహసీల్దార్ భాగ్యలత తనిఖీ చేశారు. నిర్ణీత ధరలకే అమ్మాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ వీఆర్‌వో తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: బాణసంచా వ్యాపారులు దుకాణాల వద్ద అగ్ని మాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారి సూచించారు. బుధవారం ఆయన పుల్లంపేటలోని ఎస్‌బీ వీడీ సభా క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాలను పరిశీలించారు. హెడ్‌కానిస్టేబుల్ శివ, కానిస్టేబుల్ రమేష్ పాల్గొ న్నారు.

అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యం



సునీతను పరామర్శిస్తున్న బంధువులు

సిద్దవటం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనికి చెందిన సంగటి సునీత అదృశ్యం కావడంతో మంగళవారం రాత్రి పెన్నానది పరివాహక ప్రాంతాల్లో పోలీసులు గాలింపు నిర్వహించిన విషయం తెలిసిందే. తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం సాయంత్రం 6.30 గం టల సమయంలో పెన్నానది శివాలయం వద్ద ఆత్మహత్యా ప్రయత్నం చేస్తుండగా అక్కడ స్నానం చేస్తున్న అయ్యప్ప స్వా ములు మందలించి పంపించారు. కానీ ఆమె ఇంటికి వెళ్లకుండా మరో దారిలో పెన్నానదిలో దిగేందుకు ప్రయత్నించి దట్టమైన పొదల్లో స్పృహ తప్పి పడి పోయింది. సునీత బంధువులు, గ్రామ స్థులు టార్చిలైటు సహాయంతో గాలించగా ఆమె ఆచూకీ లభ్యమైంది. దీంతో స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలిం చగా, ఎలాంటి ప్రమాదదం లేకపోవడంతో బుధవారం ఉదయం డిశ్చార్జి చేశారు. సురక్షితంగా ఇంటికి చేడంతో పోలీసులు, ఇటు బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇనుప వస్తువులు స్వాధీనం

ఓబులవారిపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగంపేట పరిసరాల్లో చోరీ చేసిన ఒకవ్యక్తి నుంచి నియంత్రణ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా వెళుతున్న పోలీసులు మంగంపేట పరిధిలోని చెన్నకేశవస్వామి గుడివద్ద అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తిని పరిశీలించగా అతని సంచిలో రోడ్డు రోలర్‌కు సంబంధించిన నాలుగు బ్లూ బుష్‌రాడ్‌లు లభించాయి. దీంతో అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు 44 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

మహిళలపై దాడి



గాయపడిన పార్వతి

వీరబల్లి, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ పిచ్చిగుంట పల్లికి చెందిన ముద్రగడ ఈశ్వ రమ్మకు, అదే ప్రాంతానికి చెందిన రామచంద్రకు దిబ్బ విషయంలో గొడవ జరుగు తోంది. బుధవారం ఈశ్వరమ్మ తన బంధువు పార్వ తితో కలసి సమస్యను తాటిగుంట పల్లి మాజీ సర్పంచ్ రామ చంద్రా రెడ్డికి చెబుతుండగా రామచంద్ర భార్య రెడ్డెమ్మ, కొడుకులు సంజీవ, నాగేంద్ర, బంధువు బయమ్మతో కల సి రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో ఈశ్వరమ్మ, పార్వతికి దెబ్బలు తగిలాయి. ఈ విషయాన్ని వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మోటారు పరికరాల చోరీ

ఓబులవారిపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మోటారువైర్లు, సోలార్ పరికరాల చోరీతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఓబులవారి పల్లె చుట్టుపక్కల ఉన్న పొలాల్లో మంగళవారం రాత్రి గుర్తు తెలి యని వ్యక్తులు ఆరుగురు రైతులకు చెందిన చేలకు కంచెగా నిర్మించుకున్న సోలార్ పరికరాల బ్యాటరీలు, మోటారు కేబుల్‌వైర్లు చోరీకి గురయ్యాయని రైతులు ఓపీ ప్రసాద్‌రెడ్డి, ఓజీ అనిల్ కుమార్‌రెడ్డి, ఓసీ వెంకటసుబ్బారెడ్డి, ఓకే భాస్కర్ రెడ్డి, ఏబీ నరేష్‌రెడ్డి, జి.ప్రశాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

మాదకద్రవ్యాలతో జీవితం అంధకారం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పట్టణ ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాజంపేట, టౌన్, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అ లవాటు పడి జీవి తాలను కోల్పోతున్నా రని పట్టణ ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి తెలి పారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో హెల్పింగ్‌హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు..

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తం, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.వెంకటనరసయ్య, ఫిజికల్ డైరెక్టర్ విజయ భాస్కర్, హెల్పింగ్‌హ్యాండ్స్ ప్రతినిధులు అబ్దుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం కొంటే గుడ్డు, వాటర్‌పాకెట్ ఫ్రీ

- బార్ యజమానుల దీపావళి ఆఫర్

రాజంపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం ప్రియులను ఆకర్షించేందుకు పట్టణంలోని రెండు బార్లు, రెస్టారెంట్‌ల ఎదుట వెరైటీ ఆఫర్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పట్టణ, మండల పరిధిలో కొత్తగా 11 మద్యం షాపులు ఏర్పాటు చేయడంతో మద్యం ప్రియులు బార్, రెస్టారెంట్లవైపు వెళ్లడం తగ్గించారు. దీంతో మద్యంప్రియులను ఆకర్షించేందుకు ఒక బాటిల్ కొనుగోలు చేస్తే ఒక గుడ్డు, గ్లాసు, వాటర్‌ప్యాకెట్ ఉచితంగా అందజేస్తామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ఉచిత ఇసుక విధానానికి విఘాతం

సిద్దవటం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో జ్యోతి పెన్నానది నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు కొంతమంది అడ్డుపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా తీసుకెళ్లవచ్చునని ముఖ్యమంత్రి ఆదేశాలు అమలు కాకుండా చేస్తున్నారని ఆగ్రహిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక ఎస్ఐ చిరంజీవిని వివరణ కోరగా ఒకవేళ ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల పెంపునకు కృషి చేయాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆర్యోగ కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. బుధవారం రాయ చోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మెరుగైన ఫలితాలను సాధించిన చిన్నమండెం, మొలకల చెరు వు, నగిరిమడుగు, దేవలంపల్లి పీహెచ్‌సీ వైద్యాధి కారులకు స్టెతస్కోపులు, బేబీ వార్మర్స్ ఒక పీహెచ్‌సీకి ఇన్వర్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఒక్క మాతా శిశు మరణం కూడా సంభవించరాదని సూచించారు. మెరుగైన ఫలితాలు సాధించిన వైద్యాధికారులను, స్టాఫ్‌నర్సులను అభినందించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కొండయ్య, డీపీఎంవో డాక్టర్ ఎం. రియాజ్ బేగ్, చిన్న మండెం, మొలకలచెరువు, నగిరిమడుగు, దేవళంపల్లి మెడికల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వైద్య అధికారులకు పరికరాలు అందజేస్తున్న కలెక్టర్

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

● మంత్రి మండిపల్లి భరోసా

చిన్నమండెం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మడిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అన్నమయ్య జిల్లాలో భూ ఆక్రమణలు అధికంగా జరిగాయని, అందువల్ల ఏర్పడిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో భూ సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. రెవెన్యూ అధికారులు భూ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. రాబోయే రోజుల్లో అన్నమయ్య జిల్లాను భూ సమస్యల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మౌర్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జిల్లా స్థాయి త్రోబాల్ టోర్నమెంటుకు మంత్రికి ఆహ్వానం

చిన్నమండెం: నంద్యాల జిల్లాలో నవంబర్ 2న నిర్వహించనున్న 18వ జిల్లా స్థాయి బాల, బాలికల త్రోబాల్ టోర్నమెంట్‌కు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఆహ్వానం అందింది. చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని ఆయన నివాసంలో శ్రీగురురాఘవేంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ దస్తగిరిరెడ్డి మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెమోరియల్ కప్పు 18వ జిల్లా స్థాయి త్రోబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆయన మంత్రిని కోరారు.


వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

మాధవరంలో అధ్వానంగా పారిశుధ్యం

సిద్దవటం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలం మాధవరం-1లో పారిశుధ్యం అధ్వానంగా మారింది ఈ విషయంపై మండల విస్తరణాధికారి మహతాజ్ యాస్మిన్ మాట్లాడుతూ, రెండు రోజుల్లో చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.



'కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్' సమస్యలు పరిష్కరించాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, కార్యదర్శి అలీహుస్సేన్ కోరారు. బుధవారం వారు డీఈవో కే. సుబ్రమణ్యంను కలిశారు. యూనియన్ సభ్యులతో కలిసి డీఈవోను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారి సమస్యలను ఆయనకు వివరించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విజయ్, కుమార్, ఉష్మా, హబీబ్, శంకరమ్మ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


డీఈవో సుబ్రమణ్యంను కలిసి సన్మానిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నేతలు

రాజంపేట: డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన కె. సుబ్రమణ్యంకు బుధవారం ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వై.సుబ్రమణ్యంరాజు, ఉపాధ్యక్షుడు ఆది నారాయణరెడ్డి, రీజనల్ కన్వీనర్ నరసింహ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అన్నమయ్య జిల్లా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అపార్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు ఆలూరు వెంక టేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్ శ్రీహరి, పుల్లంపేట మండల అధ్యక్షుడు సర్తాజ్ హుస్సేన్, సీనియర్ ఎస్టీయూ నాయకులు ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.





పకడ్బందీగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

● రూ.45,540 రికవరీకి పీడీ వెంకటరత్నం ఆదేశాలు

సుండుపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 2023-24 సంవత్సరానికి సంబంధించిన పనులపై బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ, బహిరంగ సమావేశాన్ని నిర్వహించినట్లు పీడీ వెంకటరత్నం తెలిపారు. మడితాడు గ్రామ పంచాయతీలో పనులు చేయకపోయినా చెల్లింపులు చేశారని, హౌసింగ్‌లో అదనపు నిధులు మంజూరు చేశారని, ఒకే కేటుంబానికి రెండు జాబ్‌కార్డులు ఎలా వచ్చాయని ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిలదీశారు. కొన్ని గ్రామాల్లో నాటిన మామిడి చెట్లు నాటిన చోట చనిపోయాయని, ఆ ప్రాంతాల్లో మళ్లీ నాటితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సొంతం వారిపల్లెలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడం వలన అభివృద్ధి పనుల్లో వెనుకబడి ఉన్నట్లు తెలిపారు. మరికొన్ని గ్రామ పంచాయతీల్లో పనులు బాగా చేయించారని ఫీల్డ్ అసిస్టెంట్‌లను టెక్నికల్ అసిస్టెంట్లను ఏపీవో మాలిక్‌బాషాను ప్రశంసించారు. పలు గ్రామ పంచాయతీలో రూ.45,540 రికవరీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఏపీడీ ప్రతాప్, సుండుపల్లె క్లస్టర్ పీడీ నందకుమార్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఉమామహేశ్వరరావు, ఎస్టీఎం లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఏపీడీ మాలిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


ఉపాధిలో అవకతవకలపై మడితాడు ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిలదీస్తున్న అధికారులు





పామ్ ఆయిల్ తోటల సాగుకు ప్రోత్సాహకాలు


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జేడీఏ చంద్రానాయక్


రైల్వే కోడూరు: రైతులతో మాట్లాడుతున్న ఏవో సుధాకర్

రైల్వేకోడూరు, అక్టోబరు 30:(ఆంధ్రజ్యోతి): పామ్‌ఆయిల్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఏవో జి. సుధాకర్ తెలిపారు. బుధవారం మండలం లోని కే. బుడుగుంటపల్లె, ఉర్లగట్టుపోడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామోలిన్ సాగుకు ప్రభుత్వం ఉచితంగా మొక్కలు అందజేయడంతోపాటు, నాలుగేళ్లపాటు అందుకయ్యే ఎరువులకయ్యే ఖర్చును అందజేస్తుంద న్నారు. అందులో అంతర్ పంటలు వేసుకుంటే ఎకరాకు రూ. 2000లు చొప్పున ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. పామోలిన్ కాయలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కంపెనీల వారు తీసుకుంటారని తెలిపారు. పామోలిన్ సాగుపై కంపెనీ మేనేజర్ కొండారెడ్డి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏ హరితదినేష్, పశు సంవర్ధక శాఖ, మార్కెటింగ్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రాప్ ఇన్సూరెన్స్ తప్పనిసరి


వీరబల్లి రైతులు తప్పకుండా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని జేడీఏ చంద్రానాయక్ సూచించారు. మట్లి వ్యవసాయ కేంద్ర పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి స్వాతి, టెక్నికల్ ఏవో రమేశ్‌రాజు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



పదవీ విరమణ తప్పనిసరి

సిద్దవటం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు మురాద్వావలి సేవలు రెవెన్యూ శాఖకు అవసరమని కడప ఆర్డీవో జాన్ వెర్విన్ పాలవర్తి అన్నారు. పదవీ విరమణ సందర్భంగా బుధవారం మురాద్వావలిని సత్కరించారు. ఏవో శంకరయ్య ప్రసాద్, కళావతి తదితరులు పాల్గొన్నారు







పింఛన్ల పంపిణీకి సిద్ధం కావాలి

కలికిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ శుక్రవారం సామాజిక పింఛన్ల పంపిణీకి సిద్ధం కావాలని ఎంపీడీవో భానుమూర్తిరావు కోరారు. బుధవారం సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో జరిపిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1వ తేదీన సాధ్యమైనంత వరకు పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలన్నారు. వివిధ రకాల కారణాలతో ఆగిపోయిన పింఛన్లను ఆ మరుసటి రోజుకు వందశాతం పంపిణీ చేయాలని చెప్పారు. దీనికోసం సంక్షేమ సహాయకులు ఎన్‌పీసీఐ అప్‌డేట్ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. మండలంలోని సచివాలయ సంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.

త్యాగాలను స్మరిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరులను స్మరిస్తూ మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మదనపల్లె పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం నిరంతరం పనిచేసే వారు పోలీసులన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్ నుంచి పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారని చెప్పారు. ప్రజాసేవలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల అమరవీరులను స్మరించుకోవడానికి ఈ కార్యక్రమం ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు.


క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ముగిసిన అంతర్ వర్సిటీ క్రీడా పోటీలు

మదనపల్లెటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. బాస్కెట్‌బాల్ పోటీల్లో చిత్తూరు విజయం డిగ్రీ కళాశాల విజేతగా నిలవగా, వీసీఆర్ డిగ్రీ కళాశాల రన్నర్స్‌గా నిలిచారు. అలాగే బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తిరుపతి ఎస్వీయూ కళాశాల జట్టు విజేతగా నిలవగా, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల జట్టు రన్నర్స్‌గా నిలిచారు. హ్యాండ్‌బాల్ పోటీలో తిరుపతి సీకామ్ కళాశాల జట్టు విజేతగా నిలవగా, బీఎస్ఆర్ కళాశాల జట్టు రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీలు శివశంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలకు డిమాండ్

పీలేరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులో తన తల్లిదండ్రుల పేర్లు మార్చుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని పీలేరులోని మాలమహానాడు నాయకులు తహసీల్దారుకు విజ్ఞప్తి చేశారు. మాలమహానాడు నాయకులు తుమ్మల ధరణీకుమార్, గుర్రం లోకనాథం మాట్లాడుతూ పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ నూనేవాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దొడ్డిపల్లె పంచాయతీ బండమీదపల్లె ఎస్సీ కాలనీకి చెందిన గుండ్లూరు రెడ్డప్ప తన ఆధార్ కార్డుల్లో తన తల్లిదండ్రుల పేర్లు మార్చివేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై వెంటనే విచారణ జరపాలని వారు తహసీల్దారును కోరారు.

ఘనంగా ఐక్యతా వేడుకలు

పీలేరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా బుధవారం పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ లోకేశ్ ప్రారంభించారు. ర్యాలీ అనంతరం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డా.ఎం.వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనన, మరణాలను విధిగా నమోదు చేయాలి

కలకడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జనన, మరణాల నమోదును విధిగా నమోదు చేయాలని జిల్లా ప్రోగ్రాం అధికారి మునీశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా గణాంక అధికారి ఓబుల్‌రెడ్డితో కలిసి దేవళ్లపల్లె ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది సుబ్బరత్నమ్మ, వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కలకడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలని భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు డిమాండు చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో తహశీల్దార్ ఫణికుమార్ అధ్యక్షతన జరిగిన మానిటరింగ్ సమావేశంలో మాట్లాడుతూ మండల కేంద్రంలోని పశువైద్యశాలకు దారిని కల్పించాలని కోరారు. అలాగే కలకడ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సరైన వైద్యం అందక అవస్థలు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఎంఈవో మునీంద్రనాయక్ పాల్గొన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి


మాట్లాడుతున్న మయాన్‌బాషా

ములకలచెరువు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు, పెద్దమండ్యం మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మయాన్ బాషా కోరారు. ములకలచెరువులో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు కురవక ఖరీఫ్‌లో వేరుశెనగ పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అరకొరగా కురసిన వర్షాలతో చెరువుల్లో నీరు లేకపోవడంతో పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. వర్షాలు లేని కారణంగా కూలీలు బెంగళూరు, తమిళనాడు, హైదరాబాద్ తదితర పట్టణాలకు వలసలు వెళ్తున్నారన్నారు. అరకొరగా దిగుబడి వచ్చిన వేరుశనగ కాయల ధరలు భారీగా తగ్గిపోయాయన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని రెండు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు.

సారా ధ్వంసం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని నారామాకుల తాండాలో తాలుకా సీఐ కళా వెంకటరమణ, ఎస్‌ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో 50 మంది పోలీసులతో బుధవారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో సుమారు వెయ్యి లీటర్లకు సారా బట్టీలను ధ్వసం చేశారు. ఈ సందర్భంగా సీఐ కళా వెంకటరమణ గ్రామస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

మద్యం తరలిస్తున్న ఇరువురు అరెస్టు

మదనపల్లెటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో అక్రమంగా నాటుసారా, కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇరువురిని వేర్వేరుగా ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రాయచోటి ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు మదనపల్లె మండలంలోని నారమాకుల తాండా వద్ద ద్విచక్రవాహనంలో 102 లీటర్ల నాటుసారా తరలిస్తున్న చింబాయి నాయక్‌ను అరెస్టు చేశారు. అలాగే మేడిపల్లె క్రాస్ వద్ద చీకిలబైలుకు చెందిన శ్రీనివాసులు 87 టెట్రా ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తుండగా అరెస్టు చేసి నిందితులు ఇద్దరిని రిమాండ్‌కు పంపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ యల్లయ్య, ఎస్‌ఐ శశిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

నిమ్మనపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రైతులు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ధనంజేయులు పేర్కొన్నారు. బుధవారం సామకోటవారిపల్లి పంచాయతీలో రీసర్వే ద్వారా పట్టాదారు పాసు పుస్తకాలలో జరిగిన అవకతవకలపై గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలలో వున్న సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రస్తుతం 95 అర్జీలు వచ్చాయని, వీటిని త్వరలోనే సరిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమలై యాత్రకు ఆర్టీసీ అద్దె బస్సులు


ఐక్యతా ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఐ లోకేశ్

పీలేరు, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): శబరిమలై యాత్రకు అద్దెకు పంపడానికి తమ వద్ద సరికొత్త బస్సులు సిద్ధంగా ఉన్నాయని ఆర్టీసీ పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ బస్సులకు కర్ణాటక, తమిళనాడు, కేరళలో ఎలాంటి ఆర్టీవో పన్నుల వసూళ్లు ఉండవని, ప్రతి బస్సులో ఏడుగురికి ఉచిత ప్రయాణం కలుగజేస్తున్నామన్నారు. భక్తుల కోరిక మేరకు కావాల్సిన రూట్లలో, కావాల్సినన్ని రోజులకు అద్దెకు బస్సులు ఇస్తామని, నిర్దేశిత సమయానికి కంటే 12 గంటలు ఆలస్యమైనా ఎటువంటి రుసుము ఉండదన్నారు. అద్దె బస్సుల కోసం 9959225679, 9014700628 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

వాల్మీకిపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గండబోయనపల్లె గ్రామంలో కోటలో వెలసిన సత్యమ్మ తల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు గానూ దాతలు తమవంతు చేయూతనిస్తున్నారు. ఇట్లంవారిపల్లెకు చెందిన రైతు రాజశేఖర్‌రెడ్డి బుధవారం ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.లక్ష విరాళంగా చెక్కును ఆలయ చైర్మన్ పులి సత్యారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రైతు రాజశేఖర్‌రెడ్డికి తీర్థప్రసాదాలు అందజేస్తూ ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు అమరనాథరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రమేష్‌బాబు, హరి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మిట్స్‌లో ఘనంగా దీపావళి వేడుకలు


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

కురబలకోట, అక్టోబరు 30: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కళాశాలలో విద్యార్థులు చేసిన సాంప్రదాయ నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. పండుగ విశిష్టతను ప్రిన్సిపల్ యువరాజ్ వారికి తెలియజేశారు.

4 గంటలు ఆలస్యంగా నడిచిన రైలు

ములకలచెరువు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నరసాపూర్ నుంచి ములకలచెరువు మీదుగా ధర్మవరం జంక్షన్‌కు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో ఈ రైలు సుమారు 4 గంటల పాటు ఆలస్యంగా నడిచింది.

సభ్యత్వ నమోదును బాధ్యతగా తీసుకోండి : జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకొని అంకితభావంతో పనిచేయాలని నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని పాశంవీధిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో కొన్ని సభ్యత్వాలను నమోదు చేయించారు. సభ్యత్వ నమోదులో తంబళ్లపల్లె నియోజకవర్గం అగ్రస్థానంలో ఉండేలా గ్రామ స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకు మునుపు స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు నారాయణ, గంజి మోహన, మస్తాన్‌రెడ్డి, రియాజ్‌వలి, నాజర్, ఎండీ మస్తాన్, ప్రభాకర్, చంద్రశేఖర్, అంజాద్ పాల్గొన్నారు.

చోరీపై పోలీసులకు ఫిర్యాదు

గుర్రంకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణం ఓనిలోని ఆంజనేయస్వామి ఆలయంలో చోరీపై స్థానికులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయంలో చోరీకి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. దేవాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ చోరీ జరిగిన ఆంజనేయస్వామి ఆలయాన్ని పరిశీలించారు. చోరీ తీరును భక్తులు, రైతులను అడిగి వివరాలను సేకరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మధురామచంద్రుడుతో మాట్లాడి ఆలయాల్లో జరుగుతున్న చోరీలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, సుధాకర్, శ్రీనివాసులు, శ్రీధర్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 11 మందికి ఉపాధి

మదనపల్లెటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, జిల్లా ఎంప్లాయిూస్ ఎక్సేంజ్‌శాఖ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాలో 11 మందికి ఉద్యోగాలు వచ్చాయని జీఎం ఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. బుధవారం స్థానిక కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 47 మంది అభ్యర్థులు పాల్గొనగా, వీరిలో ప్రతిభ చూపిన 11 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. వీరికి నెలకు రూ.12-17వేల వరకు వేతనం అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.



హుండీ ద్వారా రూ.5.94 లక్షల ఆదాయం


కానుకలను లెక్కిస్తున్న దేవదాయశాఖ అధికారులు

తంబళ్లపల్లె, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండలో వెలసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా రూ.5,94,257లు ఆదాయం వచ్చినట్లు ఈవో మునిరాజ తెలిపారు. బుధవారం మల్లయ్యకొండపైన ఆలయంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈవోల ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఈ ఏడాది జూలై 11 నుంచి అక్టోబరు 30వ తేది వరకు (3 నెలల 20 రోజుల కాలానికి) భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.5,94,257లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మల్లయ్యకొండ ఆలయం దిన దినాభివృద్ధి చెందుతుండటం, కొండపైకి పూర్తి స్థాయిలో రోడ్డు సౌకర్యంతో పాటు కొండపైన అన్ని సౌకర్యాలు ఉండటంతో భక్తుల తాకిడి పెరుగుతున్నట్లు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ రికార్డు అసిస్టెంట్ కిట్టన్న, ఆలయ అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున, చింతపర్తి ఆలయ శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో బాధ్యతగా మెలగాలి

మదనపల్లెటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండల ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీపీ ఇ.రెడ్డెమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సమావేశం భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందాలన్నారు. వీటితో పాటు ప్రతి ప్రభుత్వశాఖలో స్కీములను ప్రజలకు వివరించి, వాటి రాయితీ గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. మండలంలో పలు గ్రామాల్లో హిందువులకు శ్మశానవాటికలు లేవని, ఈ విషయమై రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. ఎంపీడీవో మస్తాన్‌వలి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు ముఖ్యభూమిక పోషించాలన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులు వెలుగు చంద్ర, ఉపాధ్యక్షులు డిష్ రమణ, తాజ్, ఈవోఆర్డీ అబ్దుల్ షకూర్, సర్పంచ్ ఆనంద పార్థసారథి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





టిడ్కో ఇళ్లను అందుబాటులోకి తీసుకొస్తాం

మదనపల్లెటౌన్, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): మదనపల్లె సమీపంలోని ఎర్రగన్నమిట్ట వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం నిర్మాణాలు పూర్తయిన టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.







ఉచిత సిలిండర్ల పంపిణీకి ఏర్పాట్లు : జేసీ


రికార్డు రూమును పరిశీలిస్తున్న జేసీ

పీలేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమ ప్రారంభోత్సవానికి తగిన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పీలేరు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పీలేరు తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్యాస్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వస్తున్న వివిధ సమస్యలు, చుక్కల భూములు, ఫ్రీహోల్డ్ భూముల రీ-వెరిఫికేషన్ తదితర అంశాలపై ఆయన స్థానిక సిబ్బందిని పలు ప్రశ్నలు అడిగి తగు సూచనలు చేశారు. అయా సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ప్రయత్నాలపై సమీక్షించారు. ఆ తరువాత కార్యాలయంలోని రికార్డు గదిని పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక దుర్గా గ్యాస్ ఏజెన్సీని సందర్శించి దీపం పథకం లబ్ధిదారుల గురించి వాకబు చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు భీమేశ్వరరావు, సీఎస్ డీటీ ఫజులుల్లా, తదితరులు పాల్గొన్నారు.

అనుమతికి మించి నిర్మాణాలపై చార్జిషీట్

మదనపల్లెటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అనుమతి గోరంత..నిర్మాణం కొండంత శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మదనపల్లె మున్సిపల్ అధికారులు స్పందించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ పట్టణానికి చెందిన ఎం.చంద్రశేఖర్, ఎం.రాజనారాయణ పేరిట ప్లానులు మంజూరు చేయగా వారు అనుమతికి మించి నిర్మాణాలు చేపట్టారన్నారు. దీనిపై గత ఏడాది నవంబరులో, ఈ ఏడాది జనవరిలో నిర్మాణాలు నిలిపివేయమని నోటీసులు ఇచ్చామన్నారు.. అయినా వారు నిర్మాణాలు చేస్తుండగా ఆగస్టు 17వ తేదీ మళ్లీ నోటీసు ఇచ్చామన్నారు. ఏపీపురపాలక చట్టం 1965 సెక్షన్‌లోని 140 ప్రకారం పై తెలిపిన ఇద్దరు వ్యక్తులను ప్రాసిక్యూషన్ చేసేందుకు కోర్టులో కేసు వేశామని, దీనికి సంబంధించి చార్జిషీట్ కూడా సెంబర్ అయ్యిందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

నాటుసారా జోలికెళితే జైలుశిక్షే

● నాటుసారా బట్టీలు ధ్వంసం ● 2300 లీటర్ల సారా ఊట నాశనం : సీఐ


మేకలవారిపల్లెలో నాటుసారా తయారీ సామాగ్రిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

వాల్మీకిపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారు చేసినా, విక్రయాలకు పాల్పడినా జైలుశిక్ష తప్పదని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు హెచ్చరించారు. బుధవారం మండలంలోని గండబోయనపల్లె గ్రామ పంచాయతీ మేకలవారిపల్లె పరిసర ప్రాంతాల్లో పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని రహస్య ప్రాంతాలలో నిర్వహిస్తున్న నాలుగు నాటుసారా బట్టీలను ధ్వంసం చేశారు. అలాగే రహస్యంగా దాచిన 2300 లీటర్లు నాటుసారా ఊటను ధ్వంసం చేసి తయారీ పరికరాలను సీజ్ చేశారు. అనంతరం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. నాటుసారాతో పట్టుబడితే ఉపేక్షించేది లేదని ఎంతటివారైనా సరే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా నాటుసారా తయారీ, విక్రయాలపై సమాచారం అందించాలని తెలియజేశారు. నిత్యం నిఘా పెట్టి నాటుసారాను రూపుమాపే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో వాల్మీకిపురం, గుర్రంకొండ ఎస్ఐలు చంద్రశేఖర్, మధురామచంద్రుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోజంతా జగన్ ప్రజాదర్బార్

పులివెందుల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం రోజంతా ప్రజాదర్బార్ నిర్వహించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం పులివెందులకు వచ్చారు. రెండోరోజు బుధవారం క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజాదర్బార్‌కు ప్రజలు అధికంగా తరలివచ్చారు. నియోజకవర్గ ప్రజలు, అనంతపురం, అన్నమయ్య జిల్లాల నుంచి కూడా అభిమానులు, నేతలు తరలివచ్చారు. బుధవారం ఉదయం 9 గంటలకు ప్రజాదర్బార్ ప్రారంభించి మధ్యాహ్నం 3 గంటల వరకు అక్కడే ఉన్నారు. పలువురు తమ వ్యక్తిగత సమస్యలను వివరించారు. అనంతరం.. ఇటీవల వివాహాలు జరిగిన నేతల ఇళ్లకు వెళ్లి వారిని ఆశీర్వదించారు. తిరిగి క్యాంపు కార్యాలయం చేరుకుని సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.